ఘనంగా ముక్కోటి ఏకాదశి

- వలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

నందిగామ:ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా ఆలయాల్లో కొలువుదీరిన స్వామి వార్లు ఉత్తర ద్వార దర్శనంలో భక్తులకు సాక్షాత్కరించారు. రామలింగేశ్వర స్వామి వారు ఉత్తర ద్వార దర్శనంలో భక్తులకు దర్శనమిచ్చారు. చెన్నకేశవ స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు చెన్నకేశవ స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో ముక్కోటి మహా మండపానికి తీసుకువచ్చి మహోత్సవాలు ప్రారంభించారు. నెహ్రూ నగర్‌లో వేంచేసియున్న వెంకటేశ్వర స్వామిని ఉత్తర ద్వారం నుంచి దర్శించుకునేందుకు తెల్లవారు జాము నుంచే వేలాది మంది భక్తులు బారులు తీరారు. మండలంలోని మాగల్లు గ్రామంలో గల మదన గోపాల స్వామి ఆలయంతోపాటు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో స్వామి వార్లను ఉత్తర ద్వారం ద్వారా భక్తులు దర్శించుకున్నారు.

భక్తులతో కళకళలాడిన ఆలయాలు

పెనుగంచిప్రోలు:ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా సోమవారం ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. గ్రామంలో వేంచేసి ఉన్న గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవార్ల ఉత్సవమూర్తులు ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, ఈఓ జీవీడీఎన్ లీలాకుమార్, పాలకవర్గ సభ్యులు, సిబ్బంది ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయం, ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఆలయంతో పాటు పలు ప్రముఖ ఆలయాల్లో దేవతామూర్తులు ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనమిచ్చారు.

భక్తిశ్రద్ధలతో ముక్కోటి

వత్సవాయి: ముక్కోటి పర్వదినాన్ని సోమవారం భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఉదయాన్నే భక్తులు గ్రామాల్లోని రామాలయాలు, వేణుగోపాలస్వామి ఆలయాల వద్దకు చేరుకుని స్వామివారి దర్శనాన్ని చేసుకున్నారు. ముక్కోటి సందర్భంగా స్వామివారు భక్తులకు ఉత్తరద్వారంగా దర్శనమిచ్చారు. చిట్టేల వెంకటేశ్వరస్వామి, మక్కపేటలో పట్టాభిరామచంద్రస్వామి, రాజగోపాల, వేణుగోపాల, ద్వాదశ జ్యోతిర్లింగ అయ్యప్ప స్వామి ఆలయాలకు భక్తులు పెద్దసంఖ్యలో వచ్చారు. మంగొల్లు, వత్సవాయి, భీమవరం, దబ్బాకుపల్లి, పోలంపల్లి తదితర గ్రామాలలోని రామాలయాలు భక్తులతో నిండిపోయాయి.

ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి ప్రత్యేక పూజలు

కంచికచర్ల : ముక్కోటి ఏకాదశి సందర్భంగా పలు దేవాలయాల్లో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారిని దర్శించుకునేందుకు తెల్లవారుజామునే ఆలయాలకు చేరుకున్నారు. విష్ణుపూజా, గీతాపారాయణం, గోవిందా నామస్మరణతో విశేష పూజలు చేశారు. మండలంలోని గొట్టుముక్కల గ్రామంలో రుక్మిణీ సమేత వసంత వేణుగోపాలస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో ఏకనామం చేశారు. అనంతరం గ్రామంలో గ్రామోత్సవం చేశారు.

ఉత్తర ద్వార దర్శనమిచ్చిన సీతారామచంద్ర స్వామి

అల్లూరు(వీరులపాడు):ముక్కోటి ఏకాదశి సందర్భంగా మండలంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఏకాదశి సందర్భంగా అల్లూరు గ్రామంలో వేంచేసియున్న సీతారామచంద్ర స్వామి సహిత మహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో స్వామి, అమ్మవారికి సుప్రభాత సేవ, లక్ష తులసి అర్చన, తదితర పూజలు వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామి వారు ఉత్తర ద్వార దర్శనమిచ్చారు. తదుపరి అహోరాత్ర రామనామ స్మరణ నిర్వహించారు. ఆలయ ధర్మకర్త అల్లూరి భాస్కరరావు దంపతులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వెల్లంకి గ్రామంలోని రామాలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజల అనంతరం భక్తులు ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. ఆలయ ధర్మకర్త శీలం కోటిరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు వేమిరెడ్డి కోటేశ్వరీ, నాయకులు వేమిరెడ్డి సత్యనారాయణరెడ్డి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు


ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనమిస్తున్న గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారు


వేదాద్రిలో ఉత్తర ద్వార దర్శనమిస్తున్న యోగానంద లక్ష్మీ నరసింహస్వామి


గొట్టుముక్కలలో కొలువై ఉన్న రుక్మిణీ సమేత వసంతవేణుగోపాల స్వామి


ఉత్తరద్వారంగా దర్శనమిచ్చిన స్వామివారు


తిరుమలగిరిలో ఉత్తర ద్వార దర్శనమిస్తున్న స్వామి వారు

వైకుంఠ ఏకాదశి మహోత్సవాలు ప్రారంభం

నందిగామ:పట్టణంలోని ముక్కోటి మండపంలో 123 వ వైకుంఠ ఏకాదశి మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఏడు రోజులపాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం సమయంలో నిర్వహించిన పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. రాత్రి పొద్దుపోయే వరకు కొనసాగిన ఈ కార్యక్రమాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ఆలయాల్లో ముక్కోటి శోభ

తిరుమలగిరి(జగ్గయ్యపేట):ముక్కోటి ఏకాదశి సందర్భంగా గ్రామంలో వేంచేసియున్న వెంకటేశ్వర స్వామి ఉత్తర ద్వార దర్శనమిచ్చారు. తెల్లవారు జాము నుంచే స్వామి వారి దర్శనానికి ఏపీ, తెలంగాణ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు ఆలయానికి భక్తుల తాకిడి అధికంగా ఉండటంతో ఆలయ ఏసీ శ్రీరామవరప్రసాదరావు, చైర్మన్ సుబ్రహ్మణ్యం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

వేదాద్రిలోని యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామి వారు భక్తులకు ఉత్తర ద్వార దర్శనమిచ్చారు. ముక్కోటి సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించటంతో పాటు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ ఈవో నాగరాజు అన్ని ఏర్పాట్లు చేశారు.

ఘనంగా వైకుంఠ ఏకాదశి ఉత్సవం

జగ్గయ్యపేట అర్బన్: వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తరద్వార దర్శనం కోసం పట్టణంలోని ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. బలుసుపాడు రోడ్డులో ఉన్న పాత వెంకటేశ్వరస్వామి ఆలయం, సీతారామపురంలోని కొత్త వెంకటేశ్వరస్వామి ఆలయం, పాలేటి తీరాన ఉన్న రంగనాయకస్వామి ఆలయం, బ్రాహ్మణబజారులోని గోవిందరాజస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మార్కండేయస్వామి ఆలయంలో గజ, గరుడ, అశ్వ వాహనసేవలు ప్రత్యేకంగా నిర్వహించారు. పట్టణంలోని పలు ఆలయాల నుంచి ఉత్సవమూర్తులతో ఊరేగింపుగా అర్చక స్వాములు, భక్తులు బంగారకొట్ల సెంటర్‌లో విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్దకు చేరుకుని కొతారు ఉత్సవాలు నిర్వహించారు. పెద్ద శివాలయం స్థానాచార్యులు పిల్లలమర్రి నాగేశ్వరశర్మ, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందేలా చూడాలి

వలంటీర్ల సమీక్షలో ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహన్‌రావు

కంచికచర్ల: సంక్షేమ పథకాలన్నీ అర్హులందరికీ చేరేలా చూడాలని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్‌రావు కోరారు. వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో సోమవారం వలంటీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కుల, మత, పార్టీలకతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ పింఛన్లు, ఇళ్ల స్థలం, ఇళ్లు మంజూరు చేస్తున్నారని చెప్పారు. ప్రతి వలంటీర్ కష్టపడి పనిచేయాలని సూచించారు. ఒక్కో క్లస్టర్‌కు ఇద్దరు మగవారితో పాటు ఓ మహిళను మొత్తం ముగ్గురుని అదనంగా నియమిస్తున్నామని వారంతా క్లస్టర్‌లోని ప్రజల అవసరాలను గుర్తించి పనిచేయాలన్నారు. ఆర్టీసీ జోనల్ చైర్మన్ తాతినేని పద్మావతి మాట్లాడుతూ వలంటీర్లు సంక్షేమ పథకాలు అందించటంతో పాటు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని కోరారు. వైఎస్సార్ సీపీ మండల, పట్టణ కన్వీనర్లు నన్నపనేని నరసింహారావు, వేమా సురేష్‌బాబు, ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి, సర్పంచ్ వేల్పుల సునీత, వైఎస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ మార్త రజనీ, నాయకులు కాలవ పెదబాబు, చింతా రవీంద్రనాథ్, మంగలపూడి సన్నీ, వేల్పుల శ్రీనివాసరావు, వేల్పుల రమేష్, మార్త శ్రీనివాసరావు, అబ్బూరి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు

పెద్దాపురం(వీరులపాడు):అర్హతే ప్రామాణికంగా పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. మండలంలోని పెద్దాపురం గ్రామంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి నివాసంలో గ్రామ సచివాలయ ఉద్యోగులు, సర్పంచులు, వలంటీర్‌లతో సోమవారం ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు దేశానికే ఆదర్శమని చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మహిళలకు 50 శాతం రిజర్వేషన్‌లు కల్పించారని గుర్తు చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 30 లక్షల మందికి పైగా నిరుపేదలకు ఇళ్ల స్థలాలు అందించటమే కాకుండా ఇళ్లు నిర్మించిన ఘనత ముఖ్యమంత్రికే దక్కిందని తెలిపారు. విద్యా రంగంలో పెను మార్పులకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఆర్టీసీ జోనల్ చైర్మన్ తాతినేని పద్మావతి, ఎంపీపీ కోటేరు లక్ష్మీ, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, ఏఎంసీ మాజీ చైర్మన్ బొమ్మిశెట్టి భాస్కరరావు, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పింఛన్‌ల పంపిణీ

జగ్గయ్యపేట:మండలంలోని అన్ని గ్రామాల్లో పింఛన్‌ల పంపిణీ కొనసాగుతుంది. వలంటీర్‌లు ఇంటింటికీ తిరుగుతూ ఇటీవల పెంచిన పింఛన్‌తో రూ. 2750 నగదు లబ్ధిదారులకు అందజేస్తున్నారు. ఆయా గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణలో పంపిణీ కొనసాగుతుంది. రెండవ రోజు సోమవారం 80 శాతం మేర పింఛన్‌లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో జయచంద్ర తెలిపారు.

ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ లావణ్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుంటుపల్లి వాసు, సొసైటీ అధ్యక్షుడు గూడపాటి రవికుమార్, ఉపసర్పంచ్ గుత్తా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ చేయించున్న మహిళకు పింఛను అందజేత

బలుసుపాడు(జగ్గయ్యపేట):గ్రామంలోని ఎం. అనితకు గత డిసెంబర్ నెల 9 వ తేదీన గుంటూరు వద్ద ఉన్న కాటూరి మెడికల్ కళాశాల ఆస్పత్రిలో పెద్ద ఆపరేషన్ (ఎక్స్‌పోరేటరీ లెప్రాటమీ) జరిగింది. దీంతో వితంతువు పింఛను తీసుకోలేకపోయింది. అపరేషన్ అనంతరం కొంత కాలం కదలకుండా ఉండాల్సి రావడంతో గుంటూరులోనే ఆస్పత్రి పక్కన ఒక గది తీసుకొని బిడ్డతో కలిసి ఉంటుంది. ఈ నేపథ్యంలో సోమవారం అనిత విజయవాడ బస్టాండ్ వద్దకు కారులో కదలకుండా వచ్చే ఏర్పాటుచేయగా, బలుసుపాడు గ్రామానికి చెందిన 10 వ క్లస్టర్ వలంటీర్ గండమాల అనిత విజయవాడకు వెళ్లి పెరిగిన పెన్షన్ రూ.2,750 అందజేసి వచ్చింది.

విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యం


విద్యార్థులకు ట్యాబ్‌లు అందిస్తున్న జెడ్పీటీసీ నాగమణి, సర్పంచ్ జ్యోతి

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు):విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి తెలిపారు. జెడ్పీ హైస్కూల్లో సర్పంచ్ బి.జ్యోతిబ్రహ్మంతో కలిసి ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు మంచి విద్యను అందించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యావిధానంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని చెప్పారు. దానిలో భాగంగానే విద్యార్థులకు ట్యాబ్‌లు అందించి డిజిటల్ విప్లవానికి నాంది పలికారన్నారు.

పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. అనంతరం గ్రామంలో జలజీవన్‌మిషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ర్యాలీలో పాల్గొన్నారు. గ్రామ కార్యాచరణ ప్రణాళిక తయారీలో నీరు, పారిశుద్ధ్య కమిటీ, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. హెచ్ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు, మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యులు సయ్యద్ జాన్‌మియా, వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు కొత్తపల్లి పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు కొత్తగా మంజూరయిన పింఛన్ల పంపిణీ

కంచికచర్ల : కొత్తగా మంజూరు చేసిన పింఛన్‌ల పంపిణీ కార్యక్రమం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంపిణీ చేస్తామని ఇన్‌చార్జి ఎంపీడీఓ కె.బాలశంకరరావు సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు హాజరుకానున్నారని చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల గ్రేడ్1, గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శులు విధిగా హాజరుకావాలని కోరారు.

అర్హులందరికీ పింఛన్లు అందిస్తాం

మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర

జగ్గయ్యపేట అర్బన్: అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందిస్తామని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. కౌన్సిల్ మీటింగ్ హాల్లో సచివాలయాల వెల్ఫేర్, అడ్మిన్‌లతో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో వెరిఫికేషన్‌కు వచ్చిన పింఛన్లు వీలైనంత త్వరగా పరిశీలించి అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించవద్దని సూచించారు. పింఛన్లు తీసేస్తున్నారు అని ప్రచారం చేస్తున్న ప్రతిపక్షం మాటల్లో నిజం లేదని పేర్కొన్నారు. పరిశీలన జరుగుతుందని, అర్హులందరికీ కచ్చితంగా పింఛన్లు అందించి తీరుతామని స్పష్టం చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్లు పందుల రోశయ్య, గింజుపల్లి వెంకట్రావు, కోఆప్షన్ సభ్యుడు ఖాదర్‌బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు కాశి కిషోర్, గింజుల్లి కృష్ణ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర తదితరులు

రీ సర్వేతో రైతులకు మేలు



నందిగామ:ప్రభుత్వం రైతులకు మేలు జరగాలనే ఉద్దేశంతో రీ సర్వే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఆర్డీవో రవీంద్రరావు పేర్కొన్నారు. డివిజన్ పరిధిలో రీ సర్వే నిర్వహించనున్న నేపథ్యంలో స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం సిబ్బందికి కిట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వే ద్వారా భూ వివాదాలు పరిష్కారమవుతాయి అన్నారు. డివిజన్ పరిధిలో 3.47 లక్షల ఎకరాల సాగు భూమి ఉందన్నారు. ఆయా భూముల్లో రీ సర్వే నిర్వహించేందుకు ప్రత్యేక డ్రోన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఒక్కొక్క డ్రోన్ ద్వారా రోజుకు రెండు వేల ఎకరాలకు పైగా భూమిని రీ సర్వే చేయవచ్చన్నారు. డివిజన్ పరిధిలోని సిబ్బందికి 97 రీ సర్వే కిట్లను అందజేసినట్లు తెలిపారు.

ఐక్య పోరాటంతోనే ఎస్సీ వర్గీకరణ

నందిగామ:ఐక్య పోరాటాలతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు దొండపాటి సుధాకర్ తెలిపారు. మండల పరిధిలోని పెద్దవరం గ్రామంలో సీనియర్ నాయకుడు మార్కపూడి యాకోబు అధ్యక్షతన సోమవారం ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నెమలి ప్రభాకర్, ఉపాధ్యక్షుడిగా పారి మైసయ్య, ప్రధాన కార్యదర్శిగా మార్కపూడి సత్యానందం, కార్యదర్శిగా చలపతిరావు, కోశాధికారిగా యోసేపుతోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా దొండపాటి మాట్లాడుతూ పార్టీలకతీతంగా వర్గీకరణ చట్టబద్ధత కోసం మాదిగలు ఐక్యం కావాలన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి కనకపూడి వెంకటరత్నం, నాయకులు మార్కపూడి బాబు, పి.జాన్ కోటి, ఎం.శ్రీను, జి.రూబేను, ఎం.యోహాను, రంగా తదితరులు పాల్గొన్నారు.


గ్రామ కమిటీ సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

పెనుగంచిప్రోలు:ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి తెలిపారు. కేవీఆర్ జెడ్పీ హైస్కూల్లో జెడ్పీ చైర్ పర్సన్ ఉప్పాల హారిక ఆధ్వర్యంలో ముద్రించిన స్ఫూర్తి స్టడీ మెటీరియల్‌ను పదో తరగతి విద్యార్థులకు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని కోరారు. క్రమశిక్షణతో కూడిన విద్య విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతుందన్నారు. హెచ్ఎం కె.జలజ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ బత్తుల వెంకటనర్సు, ఉపాధ్యాయులు రాయకృష్ణ, వేగినేటి రమణ, పి సునీల్, బి సుబ్బారావు, పి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



కోదండ రామాలయ నిర్మాణానికి భూమి పూజ



అల్లూరు(వీరులపాడు):సనాతన హిందూ ధర్మ ప్రచారంలో భాగంగానే ఆలయాలు నిర్మిస్తున్నామని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ మార్కండేశ్వరరావు తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్ట్ ఆర్థిక సహకారంతో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని అల్లూరు అంబేద్కర్ కాలనీలో చేపడుతున్న కోదండ రామాలయ నిర్మాణ పనులకు సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని ప్రతి ఒక్కరికీ చేరువ చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. జిల్లాలోని 20 మండలాల్లో 13 ఆలయాలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. సర్పంచ్ బండెల రాణి, ఎంపీటీసీ సభ్యురాలు మోండ్రు బాయమ్మ, జిల్లా ధర్మ ప్రచారక్ జై శంకర్, ఆలయ ఇన్‌చార్జ్ ఏఎస్ఎన్ మూర్తి, మండల సభ్యులు జగదీప్, గోపాలరావు, ధనమూర్తి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీఎం మేలు ఎన్నటికీ మర్చిపోము



నందిగామ:నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేలును ఎన్నటికీ మర్చిపోమని సచివాలయ ఉద్యోగుల సంఘం పట్టణ అధ్యక్షుడు కొంగ్రపాటి సురేష్ కుమార్ పేర్కొన్నారు. సచివాలయ ఉద్యోగులకు ప్రొబేషన్ డిక్లేర్ అయిన సందర్భంగా సీఎంకు కృతజ్ఞతలు తెలిపే కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు సచివాలయ సిబ్బంది మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థలో పనిచేయడం గర్వంగా ఉందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రికి సచివాలయ సిబ్బంది జీవితాంతం రుణపడి ఉంటారన్నారు.

సంక్షేమ పథకాలు చరిత్రాత్మకం



గుమ్మడిదూర్రు(పెనుగంచిప్రోలు):ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశ చరిత్రలోనే చరిత్రాత్మకంగా నిలిచిపోతాయని సర్పంచ్ నక్కా కమల తెలిపారు. స్థానిక గ్రామ సచివాలయంలో సోమవారం లబ్ధిదారులకు రైస్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. గ్రామ కార్యదర్శి కె సీతారామరెడ్డి, వీఆర్ఓ పి శ్రీనివాసరావు, సొసైటీ డైరెక్టర్ నక్కా సుధాకర్, సచివాలయ సిబ్బంది, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవో స్పందనలో 3 అర్జీలు

నందిగామ:సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి వాటిని పరిష్కరించుకోవాలని ఆర్డీఓ రవీంద్రరావు సూచించారు. ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పలు మండలాల నుంచి సమస్యల పరిష్కారం కోరుతూ 3 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చేందుకే ప్రభుత్వం ప్రతి సోమవారం స్పందన నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

స్పందనలో నాలుగు అర్జీలు

కంచికచర్ల : స్పందనలో పలు గ్రామాల నుంచి సమస్యల పరిష్కారం కోసం నాలుగు అర్జీలు వచ్చాయని తహసీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి తెలిపారు. రేషన్‌కార్డుల కోసం 2, ఇళ్ల స్థలం కావాలని మరో రెండు అర్జీలు వచ్చాయని పేర్కొన్నారు. వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తామని చెప్పారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ బాలశంకరరావు, హౌసింగ్ ఏఈ నరసింహారావు, ఏపీఓం కోట భాస్కరరావు, డీటీ నాగుల్‌మీరా, ఆర్ఐ శిరీష, తదితరులు పాల్గొన్నారు.

గోపాలరావు మృతి బాధాకరం

జుజ్జూరు(వీరులపాడు):మండలంలోని జుజ్జూరు గ్రామానికి చెందిన పీఏసీఎస్ చైర్మన్ పూలా రాంబాబు తండ్రి గోపాలరావు మృతి బాధాకరమని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. గ్రామంలో సోమవారం ఆయన కుటుంబ సభ్యులు సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గోపాలరావు చిత్ర పటానికి జగన్‌మోహనరావు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. పార్టీ నాయకులు ఆవుల రమేష్‌బాబు, కోటేరు ముత్తారెడ్డి, షహనాజ్ బేగం, అమర్లపూడి కీర్తి సౌజన్య, బొమ్మిశెట్టి భాస్కరరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

వెల్లంకి(వీరులపాడు):పేకాట శిబిరాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ సోమేశ్వరరావు తెలిపారు. మండలంలోని వెల్లంకి గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై సోమవారం ఆయన దాడి చేశారు. ఈ సందర్భంగా సోమేశ్వరరావు మాట్లాడుతూ పేకాడుతున్నారనే సమాచారం రావటంతో సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. నాలుగు ద్విచక్ర వాహనాలు, రూ.600 నగదు స్వాధీనం చేసుకుని వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మతి స్థిమితం లేని వ్యక్తి అదృశ్యం



తోటచర్ల(పెనుగంచిప్రోలు): మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యంపై విజయవాడ సూర్యారావుపేట పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. గ్రామానికి చెందిన కుక్కల గోపిచంద్ (సన్నీ) అనే యువకుడు డిసెంబర్ 7న విజయవాడలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు స్థానికులతో కలిసి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబసభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు.